

వైభవం..గణనాథుని గ్రామోత్సవం


యాదమరి (కాణిపాకం) : ఉగాదిని పురస్కరించుకుని బుధవారం రాత్రి కాణిపాకం శ్రీవరసిద్ధివినాయకస్వామి శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా పల్లకిలో పురవీధుల్లో విహరించారు.



సూర్యపూజోత్సవం..సర్వపాపహరణం!

నాగలాపురంలోని శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న సూర్యపూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. – 8లో

'ముత్యాల'మ్మ మురిపెం



చిల్లకూరు : ఉగాదిని పురస్కరించుకుని బుధవారం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ముత్యాల చీరను అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి రూ.44 లక్షల విడుదల




మాధవరాయస్వామి ఆలయం

రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీలోని శ్రీమాధవరాయస్వామి ఆలయానికి మహర్దశ పట్టింది. ఆలయ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో రెండో విడత రూ.40.50 లక్షల నిధులను మంజూరు అయ్యాయి. ఏడాది కిందట ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.1.50 కోట్ల నిధులను మంత్రి మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభించారు. ఆలయంలో ధ్వజస్తంభం, ప్రహరీ గోడ పనులు నిలిచిపోయాయి. ఈపనులకు రూ.40.50 లక్షలకుగాను మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.11 లక్షలను మంత్రి పెద్దిరెడ్డి సొంత నిధులు చెల్లించారు. దీంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లతో దేవదాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పుంగనూరు: అత్యంత పవిత్ర మాసమైన రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు గురువారం నుంచి ప్రారంభించారు. పట్టణంలో వేకువజామున 4.59 నిమిషాల నుంచి తొలి దీక్షలు ప్రారంభించారు. సాయంత్రం 6.31 నిమిషాలకు ఖర్జురం పండ్లు ఆహారంగా స్వీకరించి దీక్ష విరమించారు. ఏప్రిల్ 22వ తేదీ వరకు ఉపవాస దీక్షలను కొనసాగించి, చంద్రుడు కనిపించగానే రంజాన్ పండుగను నిర్వహిస్తారు. నిత్యం ఐదుసార్లు నమాజ్‌లు నిర్వహిస్తూ, ఖురాన్ పఠనం చేసి, పేదలకు ఫిత్రా ప్రకారం నగదు, అన్నదానం, వస్త్రదానం చేస్తారు.

గరుడునిపై నృసింహుని విహారం



మాడవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

రాపూరు : ఉగాదిని పురస్కరించుకుని బుధవారం పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనృసింహ స్వామివారికి గరుడసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం, పూలంగి సేవ జరిపించారు. అనంతరం సర్వాలంకాభూషితులైన శ్రీవారిని గరుడునిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో దేవదేవుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీవారి కల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. దేవదేవేరుల కల్యాణం జరిపించారు. అర్చకులు శశిస్వామి, అమరేంద్రస్వామి, వేదపండితుడు సాయిప్రసాద్‌స్వామికి ఈఓ జనార్ధన్‌రెడ్డి ఉగాది పురస్కారాలను అందించారు. నూతన వస్త్రాలు, రూ.10,116 అందజేశారు.

థ్యాంక్యూ జనాబ్



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతున్న ప్రభుత్వ ఖాజీలు

తిరుపతి మంగళం : మైనారిటీ సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రభుత్వ ఖాజీల సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఖాజీల రెన్యూవల్ పరిమితని ఐదేళ్లకు పెంచినందుకు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బుధవారం ఈమేరకు థ్యాంక్యూ జనాబ్.. సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఇవ్వడం, ఖాజీలు సంతకం చేసిన తర్వాత సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేయడం, ఏడు వేల మసీదుల్లోని ఇమామ్, మౌజీలకు గౌరవ వేతనం మంజూరు చేసినందుకు రుణపడి ఉంటామన్నారు. ఖాజీలు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, సయ్యద్ నస్రుల్లా బుఖారీ, వీఎం ఇబ్రహీం, ఎస్.మొహిద్దీన్ షరీఫ్, లతీఫ్ , ఎస్ఎండీ.రఫీ పాల్గొన్నారు.

వరసిద్ధుడికి విరుల సోయగం



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం బుధవారం ఉగాది పండుగ సందర్భంగా పరిమళ పుష్పమాలికలతో గుబాళించింది. అభిషేక ఉభయదారులు ఆలయాన్ని పరిమళభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వాగత తోరణాల వద్ద నుంచి సుపథ మండపం, ధ్వజస్తంభం, స్వాగత ద్వారాల వద్ద, ఆలయం లోపల విదేశీ పుష్పాలతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. పుష్పాలంకరణలు భక్తులను కట్టిపడేశాయి. – కాణిపాకం(యాదమరి)

కాంచిన కనులదే భాగ్యం





శోభకృత్ నామ తెలుగు సంవత్సరాదికి తిరుగిరులు స్వాగతం పలికాయి.. బుధవారం ఉగాదిని పురస్కరించుకుని శ్రీవారి సన్నిధిలో సుగంధ సుమాలు వెల్లివిరిశాయి.. ఆనందనిలయంలో ఫలపుష్పాలు కనువిందు చేశాయి.. వైకుంఠనాథుని వైభవాన్ని వీక్షించిన భక్తుల హృదయాలు పారవశ్యంతో పులకించాయి.. దేవదేవుని దివ్యతేజస్సును కాంచిన కనులదే కదా భాగ్యమూ అంటూ తన్మయత్వం చెందాయి.. విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.. మాడవీధులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.. అబ్బురపరిచే రీతిలో అపురూపమైన ప్రదర్శనలు ఆవిష్కరించింది. – తిరుమల

శతమానం భవతి..



ఉగాదిని పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులను వకుళమాత ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. బుధవారం తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో ఆయనతోపాటు కుటుంబసభ్యులకు శుభాశీస్సులు అందించారు. ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ పాల్గొన్నారు. – తిరుపతి మంగళం

జిల్లాకు చేరిన 2వ సెట్ టెన్త్ ప్రశ్నపత్రాలు



పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్, డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర పరీక్షల విభాగం నుంచి పదో తరగతి రెండవ సెట్ ప్రశ్న పత్రాలు జిల్లా కేంద్రానికి చేరాయి. బుధవారం ఉదయం డీఆర్‌వో రాజశేఖర్ సమక్షంలో వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. గురువారం ఉదయం మండలాలకు ప్రత్యేక భద్రతా వాహనాల్లో పంపిణీ చేయనున్నారు. డీఈవో విజయేంద్రరావు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, సిబ్బంది సల్లార్‌ఖాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

శుభాలు నిండాలి



జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను ఆశీర్వదిస్తున్నఅర్చకులు, పండితులు


సాక్షి, చిత్తూరు: చిత్తూరు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలతో సందడిగా మారింది. జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్‌ను పండితులు వేద ఆశీర్వచనంతో సత్కరించారు. వివిధ ఆలయాలను నుంచి వచ్చిన అర్చకులు ఐఎస్.శ్రీనివాస్ గురుకుల్, బి.వేణుగోపాల్, పండితులు పాణ్యం శ్రీనివాసశర్మ సంప్రదాయబద్ధంగా జిల్లా కలెక్టర్‌కు పరివట్టం తలపాగా కట్టి, పట్టువస్త్రంతో సత్కరించి ఆశీర్వాదం చేశారు. వివిధ ఆలయాల తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇదే సందర్భంగా జిల్లా కలెక్టర్ కూడా అర్చకులు, పండితులను కండువా, పండ్లు, పండ్లు, పూలహారాలు, నగదు దక్షిణతో ఘనంగా సత్కరించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి జె. ఏకాంబరం, అర్చక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో జాతీయ సెమినార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు బుధవారం ప్రిన్సిపల్ మనోహర్, సెమినార్ కన్వీనర్ ఉషశ్రీ తెలిపారు. ఇంపార్టెన్స్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అంశంపై సెమినార్‌లో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.బాబు, సీపీడీసీ సెక్రటరీ వెంకటేశ్వరచౌదరి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఖజానా గలగల

'చిత్తూరు నగరంలోని ఓ విద్యా సంస్థ కార్పొరేషన్‌కు నాలుగేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించలేదు. పది రోజుల కిందటి వరకు పన్ను, వడ్డీ కలిపి రూ.58 లక్షలకు చేరుకుంది. ఇటీవల ఆస్తిపన్నుపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడంతో బకాయిలు రూ.21 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. అంటే విద్యాసంస్థ నిర్వాహకులకు రూ.37 లక్షలు మిగిలినట్లయ్యింది.'



ఇది ఒక్క చిత్తూరు నగరానికే కాదు.. మున్సిపాలిటీల్లో రూ.లక్షల్లో బకాయిలున్న ఆస్తిపన్ను దారులకు వర్తిస్తుంది. ఇప్పటి వరకు ఆస్తి పన్నును ప్రతి ఆర్థిక సంవత్సరంలో అడ్వాన్స్‌గా చెల్లిస్తే 5 శాతం రిబేటు (డిస్కౌంట్) లభించేది. తాజాగా ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్ను, నీటి పన్నుపై వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజలకు, మున్సిపాలిటీలకు మేలు చేకూరినట్లయ్యింది.



చిత్తూరులో పన్ను వసూలు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

- ఆస్తిపన్నుపై వడ్డీమాఫీతో మున్సిపాలిటీలకు కాసుల వర్షం
- ఈనెలాఖరులోపు మొత్తం బకాయిలు చెల్లిస్తే అసలుపై వడ్డీమాఫీ
- జిల్లాలో రూ.47 కోట్ల బకాయిలపై.. రూ.16 కోట్లకు పైగా వడ్డీ మాఫీ
- పన్నుల వసూళ్లలో కమిషనర్ల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- మరో వారంలో రూ. 22 కోట్లు వసూలే లక్ష్యంగా మున్సిపాలిటీలు

చిత్తూరు అర్బన్: ప్రభుత్వం వడ్డీ మాఫీ నిర్ణయంతో చిత్తూరు జిల్లాలోని ఓ కార్పొరేషన్‌తో పాటు 5 మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు ఊపందుకున్నాయి. గత వారం రోజుల్లో పన్నుల వసూళ్లు ఏకంగా 70 శాతం వరకు వృద్ధి సాధించడం మున్సిపల్ ఉద్యోగులు, పాలకులకు పట్టలేని ఆనందానిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో దాదాపు రూ.7 కోట్ల వరకు బకాయిలు వసూలయ్యాయి. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చిత్తూరులో 50 వార్డుల్లోని దాదాపు 500 మందికిపైగా కార్యదర్శులు, కార్పొరేషన్ కార్యాలయంలోని వంద మంది ఉద్యోగులకు, మహిళా సంఘాలు రోజూ ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకుని పన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారు. కొన్ని మున్సిపాలిటీలు 80 శాతం లక్ష్యాలను చేరుకోగా.. మిగిలిన మున్సిపాలిటీలు ఇప్పుడైనా నిద్ర మేల్కొంటే ఖజానా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. ఈనెలాఖరులోపు వంద శాతం పన్నులు వసూలు చేసుకోకపోతే ఏప్రిల్ 1 నుంచి యథావిధిగా పన్ను బకాయిలపై వడ్డీ లెక్కించి చెల్లించాల్సి ఉంటుంది.

స్థానిక సంస్థలకు ఊపిరి

కరోనా ప్రభావం స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిపై కూడా పడిందనే చెప్పాలి. రెండేళ్ల పాటు ప్రజల ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా మారడంతో మున్సిపాలిటీల ప్రధాన ఆర్థిక వనరులైన ఆస్తిపన్ను బకాయిలు ఆశించిన స్థాయిలో వసూలుకాలేదు. కరోనాకు ముందు ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లలో పన్నుల రూపంలో దాదాపు రూ.40 కోట్లకు పైగా ఆస్తిపన్ను రూపంలో వసూలయ్యాయి. కరోనా కాలంలో ఈ మొత్తం కేవలం రూ.28 కోట్లకే పరిమితమయ్యింది. ఏటా పెరుగుతున్న భవన నిర్మాణాల నుంచి రావాల్సిన ఆస్తిపన్నులు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. ఫలితంగా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేని పరిస్థితి, కొన్నిచోట్ల పనులు చేసిన బిల్లులు చెల్లించడానికి మున్సిపాలిటీల్లో డబ్బుల్లేకపోవడం స్థానిక సంస్థల అభివృద్ధికి అడ్డుగా నిలిచాయి. ఇలాంటి పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గతవారం ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేస్తూ ఆదేశాలు ఇవ్వడం స్థానిక సంస్థలకు ఊపిరి పోసినట్లయ్యింది.

జిల్లాలో ఆస్తి పన్నుల వసూలు స్వరూపం

మున్సిపాలిటీ	ఆస్తి పన్ను బకాయిలు	వడ్డీ మాఫీ	పెండింగ్
చిత్తూరు	రూ.29.68 కోట్లు	రూ.12.35 కోట్లు	రూ.15.02 కోట్లు
పుంగనూరు	రూ.6.98 కోట్లు	రూ.79 లక్షలు	రూ.1.76 కోట్లు
పలమనేరు	రూ.2.97 కోట్లు	రూ.15 లక్షలు	రూ.46 లక్షలు
నగరి	రూ.2.44 కోట్లు	రూ.1.74 కోట్లు	రూ.70 లక్షలు
పుత్తూరు	రూ.2.09 కోట్లు	రూ.81 లక్షలు	రూ.1.26 కోట్లు
కుప్పం	రూ. 3.52 కోట్లు	రూ57.79లక్షలు	రూ. 2.94 కోట్లు
మొత్తం	రూ.47.68 కోట్లు	రూ.16.41 కోట్లు	రూ.22.14 కోట్లు

ఇది మీ మంచికే..



ప్రజల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేసింది. వన్‌టైమ్ సెటిల్ మెంట్ కింద ఒకేసారి మొత్తం బకాయిలు చెల్లించిన వారికే వడ్డీ మాఫీ వర్తిస్తుంది. నెలాఖరు వరకు వేచి ఉండకుండా వెంటనే పన్నులు చెల్లించండి. ఊరు అభివృద్ధి చెందాలంటే పన్నుల చెల్లింపే కీలకమని ప్రజలు గుర్తుపెట్టుకోవాలి. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్నులు చెల్లించినవారు ఆందోళన పడాల్సిన అవసరంలేదు. చెల్లించిన మొత్తంలో వడ్డీను లెక్కించి దాన్ని అడ్వాన్స్ ఆర్థిక సంవత్సరం పన్నుల్లో జమ చేస్తాం. – డాక్టర్ అరుణ, కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు

రెవెన్యూలో వసూల్‌రాజా!

జిల్లాలోని రెవెన్యూ శాఖలో కొందరు అవినీతి అధికారులు వసూల్‌రాజాలుగా మారిపోయారు. కాసులు ముట్టజెప్పితే చాలు నిబంధనలకు పాతర వేసేస్తారు.. ముడుపులు చెల్లిస్తే చాలు సర్కారు భూములను సైతం అవలీలగా రాసిచ్చేస్తారు.. ప్రతి పనికీ రేటు నిర్ణయించి అందినకాడికి దోచుకుంటున్నారు.. అవినీతి తిమింగలాలుగా తయారవుతున్నారు.. పాపం పండినప్పుడు ఏసీబీ వలలో చిక్కుకుంటున్నారు. ఇందుకు శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్‌బాషా ఉదంతమే నిదర్శనం. ఆర్ఐ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆయనకు ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలనే ధ్యాస లేదు. ప్రజలకు సేవలందించడంలో చిత్తశుద్ధి లేదు.. పేదలనే కనికరం లేదు.. కేవలం జేబు నింపుకోవడమే ధ్యేయంగా విధులు నిర్వర్తించేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొమ్ము చెల్లిస్తే తప్ప మనుషులుగా కూడా గుర్తించరని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు సిబ్బందిని మధ్యవర్తులుగా పెట్టుకుని తెరతీసిన వసూళ్ల పర్వంపై పలు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

- ఎస్ఆర్‌పురం తహసీల్దార్‌గా తొలి పోస్టింగ్
- బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఆరోపణలే
- జేబు నింపుకోవడమే లక్ష్యంగా విధులు

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్ : శ్రీరంగరాజపురం (ఎస్ఆర్‌పురం) తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి చర్చనీయాంశంగా మారింది. లక్ష్మణరెడ్డి అనే వ్యక్తి తన తండ్రి మరణానంతరం ఆస్తిని సోదరుడి పేరిట మార్చుకునేందుకు మ్యూటేషన్, పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం ఈ దరఖాస్తును ప్రాసెస్ చేయాల్సి తహసీల్దార్ షబ్బీర్‌బాషా లంచం కోసం పెండింగ్‌లో పెట్టారు. అడిగిన డబ్బులు ఇస్తేనే పనవుతుందని తేల్చిచెప్పారు. తమకు అంత స్తోమత లేదని లక్ష్మణరెడ్డి ప్రాధేయపడినా వినిపించుకోలేదు. చివరకు చేసేది లేక అవినీతి నిరోధకశాఖను ఆశ్రయించాడు. వారి ఆదేశాల మేరకు లక్ష్మణరెడ్డి రూ.20వేలను తహసీల్దార్‌కు చెల్లించాడు. అదే సమయంలో దాడి చేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా తహసీల్దార్‌ను పట్టుకున్నారు.



ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ షబ్బీర్‌బాషా, వీఆర్‌ఓ (ఫైల్)

మందలించినా మారని తీరు..

తహసీల్దార్ షబ్బీర్‌బాషాపై పలు ఫిర్యాదులు రావడంతో జేసీ వెంకటేశ్వర్ గతంలో వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఆయన తీరు మారలేదని పలువురు ఉద్యోగులే చెబుతున్నారు. రెవెన్యూ పనుల కోసం వచ్చిన వారిని నగదు కోసం వేధించేవారి వెల్లడిస్తున్నారు. ప్రజలకు సేవ చేయడం సంగతి దేముడెరుగు.. దోచుకోవడం.. దాచుకోవడమే లక్ష్యంగా పనిచేసేవారని స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా ఇలాంటి అవినీతి అధికారుల కారణంగా నిజాయితీగా పనిచేసేవారికి కూడా నిందలు తప్పడం లేదని రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి నుంచి ఆరోపణలే!

బంగారుపాళ్యంలో ఆర్‌ఐగా ఏడేళ్లు, ఆ తర్వాత డీటీగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో, కోర్టు పనుల నిమిత్తం లైజన్ ఆఫీసర్ గా షబ్బీర్‌బాషా విధులు నిర్వర్తించారు. తహసీల్దార్‌గా ప్రమోషన్ వచ్చిన తర్వాత ఎస్ఆర్.పురంలో ఆయకు తొలిపోస్టింగ్ వచ్చింది. అయితే విధుల్లో చేరినప్పటి నుంచి పలు ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. కింది స్థాయి ఉద్యోగులను మధ్యవర్తులుగా పెట్టుకుని భారీగా లంచాలు వసూలు చేసినట్లు తెలిసింది. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజను చీదరించుకోవడం, ముడుపులు ఇచ్చేవారికి మాత్రమే మర్యాద ఇవ్వడం షబ్బీర్ బాషా నైజమని స్థానికులు వెల్లడిస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	24
తిరుపతి	34	24
తిరుమల	31	21
గూడూరు	34	26
నగరి	36	26

విధి నిర్వహణలో నర్స్ మృతి


పూతలపట్టు: మండలంలోని తేనెపల్లె టోల్ ప్లాజా వద్ద 133 ఎస్‌వీ అంబులెన్స్‌లో నర్సుగా పనిచేస్తున్న ఊహ(22) విధి నిర్వహణలో మృతి చెందారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. బుధవారం ఉదయం ఆమె అంబులెన్స్ వద్ద విధి నిర్వహణలో ఉన్నారు. 10.30 గంటల సమయంలో ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెం దారు. ఈ వ్యాధితో ఆమె కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన గంగాధరనెల్లూరుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూర్యపూజోత్సవం..సర్వపాపహరణం!

- ఈనెల 24, 25, 26 తేదీల్లో స్వామిని తాకనున్న సూర్య కిరణాలు
- తెప్పోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు
- నాటి కరియమాణిక్య పెరుమాళ్.. నేటి వేదనారాయణస్వామి



శ్రీదేవి, భూదేవి సమేత మత్స్యావతారమూర్తి (నమూనా)



నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయం



సూర్యపూజ సమయంలో రాజగోపురం ద్వారా గర్భాలయంలోకి ప్రసరిస్తున్న కిరణాలు (ఫైల్)

పిచ్చాటూరు: నాగలాపురంలోని శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న సూర్యపూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ మూడు రోజులు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. సాయంకాలం మూలవిరాట్టుకు 630 అడుగుల దూరంలో ఉన్న రాజగోపురం నుంచి సూర్యకిరణాలు మొదటి రోజున స్వామివారి పాద భాగాన, రెండవ రోజు స్వామివారి నాభి భాగాన, మూడవ రోజు స్వామినారి ముఖ భాగాన ప్రసరించడం ఈ ఆలయ విశిష్టత. ఈ కారణంగా ఆ మూడు రోజులు స్వామివారికి సూర్యపూజోత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ సుందర దృశ్యాన్ని వీక్షించడానికి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తుంటారు. అలాగే ఏప్రిల్‌లో పౌర్ణమి నుంచి 10 రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఆలయం 1967 సెప్టెంబర్ 24న తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధీనంలోకి వచ్చింది. నాటి నుంచి నిత్య పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

చారిత్రక అంశాలు

శ్రీ కృష్ణదేవరాయలు 1517లో తన దక్షిణ దేశ పర్యటనలో భాగంగా హరికంతాపురంలో పల్లవులు నిర్మించిన శ్రీకరియమాణిక్య పెరుమాళ్ అనే ఈ చిన్న ఆలయాన్ని సందర్శించి, శ్రీవేదనారాయణ స్వామి ఆలయంగా మార్చారు. పంచ ప్రాకారములతో, సప్త ద్వారాలతో, అత్యంత కళాత్మకమైన శిల్ప కళతో తీర్చిదిద్ది, పునర్నిర్మించారు. తల్లి నాగమాంబ జ్ఞాపకార్థం ఈ ప్రాంతాన్ని నాగమాంబపురంగా నామకరణం చేసినట్లు ఈ ఆలయ ఉత్తరకుడ్యం వద్ద ఉన్న శాసనము ద్వారా తెలుస్తోంది.

ఆలయ విశేషాలు

ఈ ఆలయం నాలుగు వైపులా నాలుగు ప్రధాన గోపురాలను కలిగి ఉంది. ఇందులో ప్రధాన గోపుర ముందున్న ద్వారం అతి విశాలమైనది. వెనుక, కుడి, ఎడమలకు మరో మూడు గోపురాలు ఉన్నాయి. అవి ప్రాచీనమైనది కావడం వల్ల ఇనుప స్తంభాలతో భద్రపరిచారు. ఈ ప్రాకారంలో కొబ్బరి, పూల తోటలు ఉన్నాయి. ఈ ఆలయం వెనుక ద్వారంపై మత్స్యవతార చిత్రాన్ని చూడవచ్చు. ఇది ఆలయంలోని ప్రధాన మూల విరాట్టుకు ప్రతిరూపం. రోజూ పర్యాటకశాఖ వారి ఆలయ దర్శన బస్సులు తిరుపతి నుంచి నాగలాపురానికి వస్తుంటాయి.

బస్సు మార్గం

తిరుపతి నుంచి పుత్తూరు, ఊత్తుకోట మీదుగా చెన్నైకి వెళ్లేమార్గంలో తిరుపతికి 70 కి.మీ, చెన్నై నుంచి తిరుపతికి మధ్య 72 కి.మీ దూరంలో నాగలాపురం ఉంది. తిరుపతి నుంచి చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు, తిరుపతి నుంచి సత్యవేడుకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగుతాయి. చెన్నై మాదవరం బస్టాండు నుంచి బయలుదేరే బస్సులు చెన్నై నుంచి పెరియపాళెం, ఊత్తుకోట మీదుగా పుత్తూరుకు వెళ్లే తమిళనాడు ఆర్టీసీ బస్సులు నాగలాపురంలో ఆగుతాయి.

వివిధ పథకాలకు ఎస్సీల నుంచి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : అమ్రిత్ జలధార, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకాలకు(2022–23) అర్హులైన ఎస్సీలు దరఖాస్తు చేసు కోవచ్చని దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని, హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం లో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అమ్రిత్ జల ధారా : ఈ పథకం కింద బోరు బావి, బోరు మోటరు (సబ్‌మెర్సిబుల్), డ్రిప్, స్ప్రింక్లర్స్ మొదలైనవి. ఇందులో యూనిట్ విలువ పై 50 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం అందజేస్తారు. దరఖాస్తు చేసుకునే వారికి 2.50 ఎకరాల భూమి (ఒకరు, గ్రూపుగా ఉండవచ్చు), సంవత్సర ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదు.

యంగ్ ఎంట్రిప్రెన్యూర్ : ఈ పథకం కింద స్వయం ఉపాధి కోసం ముర్రా జాతి గేదెలు (రెండు), గొర్రెల పెంపకం, మినీ డైరీ (పాడి గేదెల పెంపకం) గ్రూపు, ట్రాక్టరు, ట్రైలర్, ప్యాసింజర్ వాహనం (కారు, వ్యాను), ఆటో మైబైల్ సర్వీసింగ్ యూనిట్, బ్యాటరీ సర్వీసింగ్ యూనిట్, కొవ్వొత్తుల తయారీ, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, ఎలక్ట్రానిక్ గూడ్స్ రిపేర్ సెంటర్, కంప్యూటర్ సేల్స్, సర్వీసింగ్, కాంక్రీట్ మిల్లర్, మట్టి ఇటుకల తయారీ, పచ్చళ్ల తయారీ, ఫొటో, వీడియో షాపు, స్టీలు, సిమెంటు షాపు, తెల్ల ఫినాయిల్ తయారీ, ఐస్‌క్రీమ్ తయారీ, చెప్పుల షాపు, శానిటరీ మార్టు, రెడీమేడ్స్ గార్మెంట్స్ తయారీ, డీటీపీ, జిరాక్స్, సివిల్ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ తదితరాలు. యూనిట్ విలువపై 50 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం ఇస్తారు. సంవత్సర ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదు.

ఇవి అవసరం : తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణపత్రం, ఆదాయ పత్రం, మొబైల్ నంబర్, బ్యాంకు పాసుపుస్తకం, భూమి పట్టాదార్ పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో లతో (rbm-r.ncof.gov.in/Bankrporta) పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.



వలకు చిక్కిన 9 కిలోల చేప

సదుం మండలం కొర్లకుంట వారిపల్లె ప్రాజెక్టులో తొమ్మిది కిలోల చేప లభ్యమైంది. అదే గ్రామానికి చెందిన యువకులు బుధవారం ప్రాజెక్ట్‌లో సరదాగా వలతో చేపలను వేటాడుతున్నారు. మహేష్ అనే యువకుని వలకు తొమ్మిది కిలోల చేప చిక్కింది. భారీ చేప పట్టుబడడంతో యువకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

-సదుం

వరకట్నం వేధింపులపై కేసు

గుడిపాల: వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు..మండలంలోని 197 రామాపురానికి చెందిన శరవణ(30)కు, చిత్తూరుకు చెందిన లావణ్య(24)కు 2016లో వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. శరవణ వ్యవసాయం చేస్తున్నాడు. కొద్దిరోజులుగా వరకట్నం తేవాలని భార్యను వేధిస్తున్నాడు. రోజు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బు తీసుకురావాలని బెదిరిస్తున్నాడు. భర్తతోపాటు అత్త ఆదెమ్మ, మామ సుబ్రమణ్యం, బావ సురేష్ కూడా కట్నంగా నగదు తీసుకురావాలని వేధించడం ప్రారంభించారు. దీంతో లావణ్య అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. నలుగురిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేప పూత కోసం చెట్టెక్కి..

- కరెంట్ వైర్లు తగిలి బాలుడి మృతి
- బసవరాజుకండ్రిగలో
- ఉగాది రోజు విషాదం



విక్రమ్ (ఫైల్)



గాయపడిన లక్ష్మమ్మ

పెద్దపంజాణి: ఉగాది పచ్చడిలోకి వేప పూత కోసం చెట్టు ఎక్కిన బాలుడు ప్రమాద వశాత్తు పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కొట్టి ప్రాణాలు విడిచాడు. మండలంలోని బసవరాజుకండ్రిగ గ్రామంలో బుధవారం ఈ ఘటన విషాదం నింపింది. పోలీసుల కథనం మేరకు..గ్రామానికి చెందిన అరుణ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రెండేళ్ల కిందట భర్త షణ్ముగం అనారోగ్యంతో మృతిచెందాడు. కుమార్తెకు వివాహం చేసింది. ఒక్కగానొక్క కుమారుడితో విక్రమ్(16)తో కలసి ఉంటోంది. బుధవారం ఉగాది పచ్చడి కోసం విక్రమ్‌ను వేప పూత తెమ్మని చెప్పింది. విక్రమ్ గ్రామ సమీపంలోని పొలాల వద్ద ఉన్న వేప చెట్టు ఎక్కి పూత కోస్తున్నాడు. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి కింద పడి మృతి చెందాడు. కుమారుడు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అరుణ పొలాల వద్దకు వెళ్లింది. వేప చెట్టు కింద విగతజీవుడిగా పడి ఉన్న కుమారుడిని చూసి బిగ్గరగా కేకలు వేసింది. స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు గుర్తించారు. తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భర్త సమాధి వద్ద పూజ చేసి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు తీవ్ర గాయాలు

శాంతిపురం: ఉగాది పండుగలో భాగంగా సమాధి వద్ద పూజ చేసి వస్తుండగా బైకును కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. కుప్పం–పలమనేరు జాతీయ రహదారి మఠం వద్ద ఈ ఘటన చేటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా కెనమాకులపల్లికి చెందిన లక్ష్మమ్మ(45) కొడుకు సురేష్(27)తో కలిసి బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లింది. అక్కడ భర్త సమాధి వద్ద పూజ ముగించుకుని తిరుగు ప్రయాణమైంది. మఠం వద్ద అతి వేగంగా ఎదురుగా వచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈఘటనలో తల్లీకొడుకులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు కుటుంబ సభ్యులు బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- ఒకరి అరెస్ట్, ఇద్దరు పరారీ

గుడిపాల: కర్ణాటకు నుంచి తమిళనాడు మీదుగా చిత్తూరు వైపు అక్రమంగా తరలిస్తున్న 1,632 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు చిత్తూరు వెస్ట్ సర్కిల్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం గుడిపాల మండలంలోని మద్రాస్ క్రాస్ రోడ్డు సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు., వేలూరు నుంచి చిత్తూరు వైపు అతివేగంగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. ఈ సమయంలో కారులో ఉన్న ఇద్దరు పారిపోయారు. కారులో ఉన్న 1,632 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సంతపేటకు చెందిన డ్రైవర్ సాయికుమార్ (23)ను అరెస్ట్ చేశారు. విచారణలో పరారీ అయిన వారు చిత్తూరు వీరభద్రకాలనీకి చెందిన అన్సర్, గంగనపల్లెకు చెందిన గణేష్‌గా గుర్తించారు. వీరు కొంతకాలంగా కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి విక్రస్తున్నట్లు తేలింది. పరారీలో ఉన్న ఇద్దరినీ త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కారుసహా మద్యం విలువ రూ.6 లక్షలు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ మునివేలు, సిబ్బంది బాలసుబ్రమణ్యం, రామారావు, విజయ్, భరత్, పాల్‌రాజ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి

– మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





మృతులు అబ్బుర్ సిద్ధిక్, రెడ్డెప్ప (ఫైల్)

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లె ఎస్సీ కాలనీ రోడ్డులో మంగళ వారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమా దంలో అబ్బుర్ సిద్ది క్(19) రెడ్డెప్ప(31) మృతి చెందగా, శ్రీనివాసులు, వాసు తీవ్రంగా గాయ పడ్డారు. పోలీసుల కథనం మేరకు ..మం డలంలోని కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన అబ్బుర్ సిద్దిక్, వాసు ద్విచక్ర వాహనంలో కుప్పం నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఇదే క్రమంలో మిద్దూరు గ్రామానికి చెందిన రెడ్డెప్ప, గుండ్లసాగరం గ్రామానికి చెందిన వాసు ద్విచక్ర వాహనంలో కనమనపల్లె నుంచి గుండ్లసాగరం వెళుతున్నారు. కుప్పం – ద్రవిడ వర్సిటీ రోడ్డులో కనమనపల్లె ఎస్సీ కాలనీ వద్ద రెడ్డప్ప, శ్రీనివాసులు వెళుతున్న మోటార్ సైకిల్ లారీని ఓవర్ టేక్ చేసి ఎదురుగా వస్తున్న అబ్బుర్‌సిద్దిక్, వాసు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని కిందపడ్డారు. ఈ ఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అబ్బుర్‌సిద్దిక్, రెడ్డెప్ప మృతి చెందారు. వాసు, శ్రీనివాసులు చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలోని ఊంజల్‌సేవా మండపంలో బుధవారం ఉగాదిని పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని మేడసాని మోహన్ తన రచనలను చదివి వినిపించారు. అనంతరం 8 మంది కవుల ఆధ్వర్యంలో చేపట్టిన అష్టావధానం విశేషంగా ఆకట్టుకుంది పలువురు సాహితీప్రియులు సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆర్‌డీఓ రామారావు హాజరయ్యారు. అలాగే ఉదయం స్వామి సన్నిధిలో కరణం లక్ష్మీనారాయణశర్మ పంచాంగ శ్రవణం చేశారు.

ఆదిదంపతుల విహారం

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారు ఉగాదిని పురస్కరించుకుని పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



కవి సమ్మేళనంలో మేడసాని మోహన్ తదితరులు



హాజరైన పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు